క్లుప్తంగా

ఏయూ విజిలెన్స్ అధికారిగా చిట్టిబాబు



ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు నుంచి ఉత్తర్వులు అందుకుంటున్న ఆచార్య చిట్టిబాబు

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం విజిలెన్స్ అధికారిగా కెమికల్ ఇంజినీరింగ్ ఆచార్యుడు ఎస్.చిట్టిబాబు నియమితుడయ్యారు. ఈ మేరకు ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు శనివారం చిట్టిబాబుకు ఉత్తర్వులు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత



స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు

విశాఖ సిటీ: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు అన్నారు. ఏయూ లా కాలేజీలో శనివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ మన చుట్టూ ఉండే పరిసరాలను మనమే పరిశుభ్రంగా ఉంచుకోవాలని మహాత్మా గాంధీ చెప్పారని గుర్తు చేశారు. ఆయన స్ఫూర్తితోనే ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా లా కళాశాల ప్రాంగణంలోని వ్యర్థాలను ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులతో కలిసి రిజిస్ట్రార్ శుభ్రపరిచారు. కార్యక్రమంలో లా కాలేజ్ ప్రిన్సిపాల్ ఆచార్య కె.సీతామాణిక్యం, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎన్.హరనాథ్, డాక్టర్ పల్లవి, ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరద బాధితుల సహాయార్థం విరాళం



ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావుకు చెక్కు అందిస్తున్న మాన్సాస్ ప్రతినిధులు

విశాఖ సిటీ: విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఆంధ్రా యూనివర్సిటీ అనుబంధ కళాశాలలు ముందుకొచ్చాయి. మన్యం జిల్లాలోని ఎస్.వి.కిషోర్‌చంద్రదేవ్ డిగ్రీ కళాశాల రూ.51,116, విజయనగరం మాన్సాస్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ రూ.2.5 లక్షల విరాళం చెక్కులను శనివారం ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావుకు అందజేశారు. వీటిని సీఎం సహాయ నిధికి పంపించాలని కోరారు. కార్యక్రమంలో సీడీసీ డీన్ ఆచార్య టి.వి.కృష్ణ, ఆయా కళాశాలల ప్రతినిధులు పాల్గొన్నారు.

పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలు



పెంపుడు కుక్కకు టీకా వేస్తున్న ఏడీ డాక్టర్ శ్రీనివాసరావు

ఆరిలోవ: ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా శనివారం తోటగరువు పశు వైద్యశాలలో పెంపుడు కుక్కలకు ఉచిత వ్యాక్సిన్ వేశారు. ఆరిలోవ, తోటగరువు, రవీంద్రనగర్, ఆదర్శనగర్, పెదగదిలి, చినగదిలి తదితర ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన 31 కుక్కలకు రేబిస్ టీకాలు వేసినట్లు పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. కుక్కల యజమానులకు సూచనలిచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

బాబుకు సద్బుద్ధి ప్రసాదించు స్వామీ



11వ వార్డులో వేంకటేశ్వర స్వామి ఆలయ మెట్లకు పసుపు రాస్తున్న మేయర్ హరివెంకటకుమారి

- తిరుమలేశుడి పవిత్రతను దెబ్బతీయడమే సీఎం చంద్రబాబు లక్ష్యం
- మేయర్ గొలగాని హరివెంకటకుమారి
- వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో పాప ప్రక్షాళన పూజలు

ఆరిలోవ/ఎంవీపీకాలనీ: తిరుపతి వేంకటేశ్వర స్వామితో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆటలాడుతున్నారని మేయర్ గొలగాని హరివెంకటకుమారి ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి వ్యవహారంలో చంద్రబాబు పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు శనివారం 11వ వార్డు భరత్‌నగర్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మేయర్ పూజలు చేశారు. ఆలయ మెట్లకు పసుపు రాసి కుంకుమ బొట్లు పెట్టారు. ఆలయ ఆవరణలోని ధ్వజస్తంభం వద్ద దీపం వెలిగించి తిరుమల పవిత్రతను కాపాడాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ చంద్రబాబు లడ్డూను రాజకీయం చేసి లబ్ధి పొందాలనుకోవడం మహాపాపమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వేంకటేశ్వర స్వామి భక్తుల మనోభావాలను కించపరిచారన్నారు.

కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు గడిచినా హామీలను నెరవేర్చలేకపోవడం, విజయవాడ వరదల్లో నష్టపోయిన వారిని ఆదుకోవడంలో విఫలమవడంతో కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని చెప్పింది. దీన్ని కప్పి పుచ్చుకోవడానికి లడ్డూ వ్యవహారాన్ని తెరపైకి తీసుకొచ్చారని ఆరోపించారు. వేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడానికి డిక్లరేషన్ పేరుతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అడ్డుకోవడం మరో తప్పు చేసినట్లయిందన్నారు. గతంలో లేని డిక్లరేషన్ ఇప్పుడు ఎందుకు అవసరమని ప్రశ్నించారు. కార్యక్రమంలో



20వ వార్డు వేంకటేశ్వర స్వామి ఆలయంలో పాప ప్రక్షాళన పూజలు చేస్తున్న మేయర్ హరివెంకటకుమారి, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

వైఎస్సార్‌సీపీ నాయకులు గొలగాని శ్రీనివాస్, అల్లంపల్లి రాజాబాబు, కొరికాన మోహనరావు, గూడపాటి విక్టర్, కె.ఆర్ పాత్రుడు, వెంకటేష్, వెంకట్, ఈశ్వరరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి లడ్డూపై అబద్ధ ప్రచారాలు

తిరుపతి వేంకటేశ్వర స్వామి పవిత్రతను దెబ్బతీయాలనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నీచ రాజకీయానికి తెరతీశారని మేయర్ గొలగాని హరివెంకటకుమారి మండిపడ్డారు. బాబుకు సద్బుద్ధిని ప్రసాదించాలని కోరుతూ శనివారం వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ శ్రేణులు పాప ప్రక్షాళన పూజలు నిర్వహించాయి. 20వ వార్డు కార్పొరేటర్ ముచ్చల లక్ష్మి ఆధ్వర్యంలో వార్డులోని పెదవాల్తేరు సెంటర్ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజా కార్యక్రమం చేపట్టారు. మేయర్ హరివెంకటకుమారి పార్టీ నాయకులతో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నెయ్యి కల్తీ అవ్వకుండానే అయ్యిందంటూ అబద్ధాలను ప్రచారం చేశారన్నారు. హిందువులతోపాటు శ్రీవారిని విశ్వసించే కోట్ల మంది ప్రజల మనోభావాలను సీఎం చంద్రబాబు దెబ్బతీశారని ఆరోపించారు. ఆయన పాపానికి ప్రాయశ్చిత్తంతోపాటు రాష్ట్ర ప్రజలను వేంకటేశ్వర స్వామి సుభిక్షంగా చూడాలని కోరుతూ పూజలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

గుర్రం జాషువాకు ఘన నివాళి



ఏయూలో జాషువాకు నివాళులర్పిస్తున్న తెలుగు శాఖ అధ్యక్షుడు అప్పారావు తదితరులు

విశాఖ సిటీ: నిరుపేదగా జన్మించి విశ్వనాథుడిగా ఎదిగి సిద్ధాంతాల కోసం కలం పట్టిన యోధుడు, నవయుగ కవి చక్రవర్తి పద్మభూషణ్ గుర్రం జాషువా అని ఏయూ తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య జర్రా అప్పారావు కొనియాడారు. గుర్రం జాషువా జయంతి సందర్భంగా తెలుగు విభాగంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య అప్పారావు మాట్లాడుతూ అట్టడుగు వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం అనేక కవిత్వాలు రాశారన్నారు. ఆచార్య వెలమల సిమ్మన్న మాట్లాడుతూ జాషువా అట్టడుగున ఉన్న నిరుపేదలను చూడగలిగిన నిబద్ధత గల సామాజిక శాస్త్రవేత్త అని పేర్కొన్నారు. జాషువా రచనల్లో సమతా, మమతా, మమకారం, ప్రేమ, వాత్సల్యం, స్వేచ్ఛ, నీతి, దేశభక్తి, విశ్వశాంతి, మానవతా మొదలైన అంశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ ఈశ్వరమ్మ, డాక్టర్ లావణ్య, డాక్టర్ వెంకటస్వామి, డాక్టర్ రత్న శేఖర్, డా.వెంకటేశ్వర్లు, డాక్టర్ సీతారత్నం, డాక్టర్ గిరీష్ కుమార్, డాక్టర్ ఎం.దాసు, డాక్టర్ ఎం.ప్రతాప్, డాక్టర్ సూర్యనారాయణ, డాక్టర్ కృష్ణవేణి, పరిశోధకులు, స్నాతకోత్తర విద్యార్థులు పాల్గొన్నారు.



కృష్ణా కళాశాలలో మీగడ రామలింగేశ్వరరావును సత్కరిస్తున్న అధ్యాపక బృందం

సమాజ చైతన్యమే జాషువా కవిత్వం

మద్దిలపాలెం: గుర్రం జాషువా కవిత్వం సమాజ చైతన్య పూరితమైనదని సాహితీవేత్త, పద్యనాటక కళాకారుడు, నంది అవార్డు గ్రహీత, విశ్రాంత తెలుగు అధ్యాపకుడు డాక్టర్ మీగడ రామలింగేశ్వరరావు అన్నారు. డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం గుర్రం జాషువా జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ అధ్యక్షతన జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పద్యగాన గంధర్వుడు మీగడ రామలింగేశ్వరరావును ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ భారతీయ సమాజాన్ని తన ప్రసంగాల్లో జాషువా కదలించారన్నారు. అనంతరం జాషువా సాహిత్యంపై నిర్వహించిన పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఆర్.కుసుమకుమారి వి.సూర్యనారాయణ, పోలా ఉమామహేశ్వరరావు, పి.గోపాల్ నాయుడు, డి.శ్రావణ్ కుమార్, బి.లక్ష్మి, ఆర్.రాణి తదితరులు పాల్గొన్నారు.

108 మంది పోలీసులకు రివార్డులు



సీపీ చేతుల మీదుగా రివార్డు అందుకుంటున్న వన్‌టౌన్ కానిస్టేబుల్ చిరంజీవి

మద్దిలపాలెం: నగర పోలీసు శాఖలో ఉత్తమ సేవలందించిన 108 మంది అధికారులు, సిబ్బందికి నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి రివార్డులు అందజేశారు. వృత్తిలో అంకితభావంతో పని చేసిన హోంగార్డు స్థాయి నుంచి సీఐ స్థాయి అధికారులకు రివార్డులను అందజేశారు. ప్రతి నెలా ప్రతిభ కనబరిచిన వారికి ప్రోత్సాహకాలు అందజేస్తున్నామన్నారు.తమ ప్రతిభను గుర్తించి, ఉన్నతాధికారుల సమక్షంలో పోలీసు కమిషనర్ రివార్డులు అందజేయడంపై సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

సంతపాలెం పాఠశాల సందర్శన



విద్యార్థులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి డిప్యూటీ డీఈవో రవీంద్రబాబు

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు చినగదిలి సంతపాలెంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను శనివారం ఇన్‌చార్జి డిప్యూటీ డీఈవో రవీంద్రబాబు సందర్శించారు. తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి పాఠ్యాంశాలకు సంబంధించిన ప్రశ్నలు అడిగారు. మధ్యాహ్న భోజనం గురించి ఆరా తీశారు. పాఠశాల రికార్డులు పరిశీలించారు. విద్యార్థుల సంఖ్య గురించి ప్రధానోపాధ్యాయుడు సిహెచ్.శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు. పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు ఆయన సూచించారు.

కృష్ణా కళాశాలలో ‘స్వచ్ఛ భారత్’

మద్దిలపాలెం: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యంతోపాటు ఆనందాన్ని పొందగలరని డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ అన్నారు. మద్దిలపాలెం డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో శనివారం ఎన్‌సీసీ క్యాడెట్లు క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడుతూ కళాశాల, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కృష్ణా ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల 13వ ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ విద్యార్థుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ కేర్ టేకర్ ఎం.బాలకృష్ణ, జూనియర్



స్వచ్ఛ భారత్‌లో పాల్గొన్న కృష్ణా జూనియర్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు, అధికారులు

కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ సన్యాసిరావు, డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారులు పి.ఉమామహేశ్వరరావు, శామ్యూల్ డేవిడ్‌రాజ్, జి.వి.ప్రతాప్, బి.లక్ష్మి, జి.లక్ష్మణరావు, ఎం.గోపి, బాలమురళి, ఎన్‌సీసీ క్యాడెట్లు స్వచ్ఛ భారత్ చేపట్టి కళాశాల పరిసరాలను శుభ్రం చేశారు.

స్ఫూర్తి ప్రదాత భగత్‌సింగ్

మద్దిలపాలెం: ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో శనివారం హెచ్‌బీ కాలనీ బస్టాప్ వద్ద స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భగత్‌సింగ్ ఫ్లెక్సీకి జిల్లా నాయకుడు ఎస్.మధురెడ్డి, రవిల బృందం పూలమాలలు వేసి నివాళులర్పించారు. మధురెడ్డి మాట్లాడుతూ స్వాతంత్రోద్యమంలో బ్రిటిష్ పాలకులపై తిరుగుబాటు చేసిన సర్దార్ భగత్‌సింగ్ నేటి యువతకు స్ఫూర్తి ప్రదాతని పేర్కొన్నారు. ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర పాలకులు ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దేశంలోని ప్రభుత్వ రంగ పరిశ్రమలన్నీ అంబానీ, అదానీ లాంటి బడా ప్రైవేట్ సంస్థలకు తాకట్టు పెడుతున్నారన్నారు. మరోవైపు విశాఖలో 32 మంది ప్రాణ త్యాగాలతో ఏర్పడిన స్టీల్‌ప్లాంట్



భగత్‌సింగ్ ఫ్లెక్సీ వద్ద నివాళులర్పిస్తున్న ఏఐవైఎఫ్ ప్రతినిధులు

ప్రైవేటీకరణ చేస్తామని కేంద్రం చెబుతుంటే, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రాజకీయాలు చేస్తోందన్నారు. అక్టోబర్ 2న స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం చేపట్టే ప్రజా పోరాటానికి యువత అందరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు రావి అశోక్, 15వ వార్డు ఉపాధ్యక్షులు బాలు, హరీష్, తేజ, రాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వీఐపీల భద్రతకు పీఎస్‌వో శిక్షణ

మద్దిలపాలెం: వీఐపీల భద్రతకు నగర పోలీస్ కమిషనరేట్ నుంచి తొలి సారిగా 51 మంది కానిస్టేబుళ్లను ఎంపిక చేసి, పీఎస్‌వో శిక్షణ ఇచ్చామని సీపీ శంఖబ్రత బాగ్చి తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన 51 మందితో శనివారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ వీఐపీల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వడానికి ఇంటిలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ వారిచే ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చామన్నారు. ఈ శిక్షణలో ప్రతిభ చూపిన వారికి ప్రశంసా పత్రాలను అందజేశామన్నారు. అర్హత, సామర్థ్యం కలిగిన వారిని ఎంపిక చేశామని చెప్పారు. శిక్షణ తీసుకున్న మెలకువలతో వారి విధులను సమర్థవంతంగా నిర్వహించాలని సీపీ సూచించారు.

ఆస్పత్రి వద్ద హడావుడి

ఆరిలోవ: ఆరిలోవ హెల్త్‌సిటీలోని బ్రిందా ఆస్పత్రి వద్ద శనివారం హడావుడి చోటుచేసుకుంది. తరుచూ హెల్త్‌సిటీ ఆస్పత్రుల్లో ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. విజయనగరం జిల్లా జామి మండలం కొత్త బీమసింగికి చెందిన ఆల్తి నర్సినాయుడు(42) కొన్నాళ్లుగా పేగు ఒరుపు వ్యాధితో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు విజయనగరంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స కోసం అతడిని చేర్పించారు. వైద్యులు పరీక్షించి పేగు క్యాన్సర్ ఉన్నట్లు అనుమానంతో హెల్త్‌సిటీ బ్రిందా ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. దీంతో కుటుంబ సభ్యులు నర్సినాయుడిని ఈ నెల 19న బ్రిందా ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యులు పరీక్షలు జరిపి పేగు క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారించారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఈ నెల 21న సర్జరీ చేశారు. శుక్రవారం రాత్రి నర్సినాయుడు మృతి చెందాడు. వైద్యులు సర్జరీ సరిగా చేయకపోవడం వల్లే నర్సినాయుడు మరణించాడని కుటుంబ సభ్యులు భావించి మృతదేహాన్ని తీసుకెళ్లకుండా వదిలేశారు. విషయం తెలుసుకున్న కొత్త బీమసింగి గ్రామస్తులు, మృతుడి కుటుంబ సభ్యులు శనివారం ఉదయం పెద్ద సంఖ్యలో బ్రిందా ఆస్పత్రి వద్దకు చేరుకుని నిర్వాహకులను నిలదీశారు. 100కు డయల్ చేయడంతో ఆరిలోవ, ఎంవీపీ పోలీసులు ఆస్పత్రి వద్దకు చేరుకుని గొడవ జరగకుండా పరిస్థితిని నియంత్రించారు. కొద్ది చేపటికి కొత్త బీమసింగి గ్రామ ప్రెసిడెంట్, కుటుంబ సభ్యులు ఆస్పత్రి నిర్వాహకులతో సంప్రదింపులు జరిపి మృతదేహాన్ని తమ గ్రామానికి అంబులెన్స్‌లో తరలించారు. దీనిపై ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో మృతుడి కుటుంబ సభ్యులెవ్వరూ ఫిర్యాదు చేయలేదని ఎస్ఐ కృష్ణ తెలిపారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



తోటగరువు హైస్కూల్‌లో వాలీబాల్ పోటీలో తలపడుతున్న విద్యార్థులు



కబడ్డీలో తలపడుతున్న విద్యార్థులు

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గంలో పాఠశాల స్థాయి క్రీడా పోటీలు శనివారం తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉత్సాహంగా మొదలయ్యాయి. వీటిని 10వ వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి ప్రారంభించారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను ఆమె అభినందించారు. మండల స్థాయిలో ఇటీవల జరిగిన పోటీలలో విజేతలను నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. నియోజకవర్గంలోని 8 పాఠశాలలు(ప్రభుత్వ, ప్రభుత్వంచే గుర్తింపు పొందిన ప్రైవేట్) నుంచి సుమారు 200 మంది విద్యార్థులు పోటీలకు అర్హులయ్యారు. వీరికి అండర్–14, అండర్–17 విభాగాల్లో పోటీలు జరుగుతున్నాయి. షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, చదరంగం, యోగా విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. మొదటి రోజు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, చదరంగం క్రీడల్లో పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా మండల క్రీడల కో ఆర్డినేటర్ వి.శ్రీనివాసరావు



చదరంగం ఆడుతున్న విద్యార్థులు

మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయి పోటీల్లో విజేతలను జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఈ నెల 30తో పోటీలు ముగుస్తాయని చెప్పారు. కార్యక్రమంలో తోటగరువు హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం రామకృష్ణ, వివిధ పాఠశాలల పీఈటీలు వివేకానంద, రాజు, చిన్నారావు, చంద్రబాబునాయుడు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు విద్యార్థులు ఉద్యమించాలి

- ‘విద్యార్థి మేధో మథనం’లో వక్తల పిలుపు

తాటిచెట్లపాలెం: విద్యార్థుల పోరాటాలతోనే స్టీల్‌ప్లాంట్ నిర్మాణం జరిగిందని, దాని పరిరక్షణకు కూడా మనమే ఉద్యమించాలని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ బాలమోహన్ దాస్, డాక్టర్ రామ్మోహన్‌రావు, కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు సిహెచ్.నరసింగరావులు విద్యార్థులు, యువతకు పిలుపునిచ్చారు. దేశం కోసం ప్రాణాలొదిలిన భగత్ సింగ్ 117వ జయంతి స్ఫూర్తితో ఆంధ్రా యూనివర్సిటీ టి.ఎల్.ఎన్. సభా హాల్‌లో ఏయూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థి మేధో మథనం పేరుతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు అనే నినాదాన్ని.. విశాఖ ఉక్కు–మన హక్కు నినాదంగా మార్చాలని నిర్వాహకులను కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్.జె.నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బాలమోహన్‌దాస్, రామ్మోహన్‌రావు, సిహెచ్.నరసింగరావు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్, పూర్వ విద్యార్థి సంఘం నాయకులు డా.బి.గంగారావు, బి.జగన్ భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్టీల్‌ప్లాంట్‌ను కాపా



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఆచార్య బాలమోహన్‌దాస్

డుకుంటేనే మిగిలిన రైల్వే, డిఫెన్స్, ఆయిల్, విద్యుత్ కంపెనీలు వంటి ప్రభుత్వ రంగ సంస్థలను రక్షించుకోగలుగుతామన్నారు. నేడు స్టీల్ ప్లాంట్‌లో 4,070 మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించడానికి పూనుకోగా.. పర్మినెంట్ కార్మికులను వి.ఆర్.ఎస్.పేరుతో ఇంటికి పంపడానికి ప్రయత్నం చేస్తోందన్నారు. దీనిని వ్యతిరేకించకపోతే మన రాష్ట్రానికి తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం చేపట్టే ఉద్యమానికి ఆంధ్రా యూనివర్సిటీలోనే పునాది వేయాలని, ప్లాంట్‌కు సొంతగనులు కేటాయించాలని, లోన్లు మాఫీ చేసి రూ.5 వేల కోట్లు కేటాయించాలని ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థి, యువజన సంఘం నాయకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కేంద్ర కారాగారంలో న్యాయ సదస్సు

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారాన్ని శనివారం జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ(డీఎల్ఎస్ఏ) చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ సందర్శించారు. ఈ సందర్భంగా జైల్ అధికారులతో కలిసి బేరక్‌లు పరిశీలించారు. ఖైదీలకు అందిస్తున్న ఆహారం, వసతులు, వైద్య సేవల గురించి ఆరా తీశారు. అనంతరం న్యాయ సదస్సు ఏర్పాటు చేశారు. జైల్‌లో ముద్దాయిలకు ఉచితంగా అందించే న్యాయ సేవలపై అవగాహన కల్పించారు. ఉచిత న్యాయ సలహాలు ఇచ్చారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జైల్ సూపరింటెండెంట్ ఎస్.కిశోర్‌కుమార్, డీఎల్ఎస్ఏ సభ్యులు పాల్గొన్నారు.



ఖైదీలకు న్యాయ సేవలపై అవగాహన కల్పిస్తున్న డీఎల్ఎస్ఏ చైర్మన్ గిరిధర్

సాగరతీరంలో వాక్‌థాన్

బీచ్‌రోడ్డు: వరల్డ్ హార్ట్ డేను పురస్కరించుకొని అపోలో హాస్పిటల్ ఆధ్వర్యంలో శనివారం గుండె జబ్బులపై ఆర్కే బీచ్ రోడ్డులో వాక్‌థాన్ నిర్వహించారు. కాళీమాత ఆలయం నుంచి వైఎంసీఏ వరకు నడక సాగింది. ప్రఖ్యాత కార్డియాలజిస్టులు, కార్డియో థొరాసిక్ సర్జన్లు డాక్టర్ డి.కె.బారుహ్, డాక్టర్ ఎస్.కె.పాణిగ్రాహి, డాక్టర్ త్రివేది, డాక్టర్ విజయ్.ఎల్, డాక్టర్ శశాంక్.సి, డాక్టర్ చక్రధర్ పీ, అపోలో సీవోవో డాక్టర్ రామచంద్ర తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు ఇతర నిపుణులు, వైద్యులు, రెండు వేల మందికి పైగా కార్పొరేట్ ఉద్యోగులు, ఆరోగ్య స్పృహ కలిగిన వారు వాక్‌థాన్‌లో నడిచారు. ఈ సందర్భంగా అపోలో హాస్పిటల్స్ సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ డి.కె.బారుహ్ మాట్లాడుతూ దేశ యువతలో గుండెపోటు మరణాలు



వాక్‌థాన్‌లో పాల్గొన్న వైద్యులు, ఉద్యోగులు

ఎక్కువగా ఉన్నాయన్నారు. విశాఖ అపోలో హాస్పిటల్స్ నిర్వహించిన అధ్యయనంలో 45 ఏళ్ల కంటే తక్కువ వయసున్న యువకుల్లో ఏఎంఐ సంబంధిత ప్రమాద కారకాలతో బాధపడుతున్నట్లు తెలిసిందని చెప్పారు. ధూమపానం, మద్యపానం చేయకూడదని, జంక్ ఫుడ్స్, పానీయాలకు దూరంగా ఉండాలని, ప్రతి రోజూ వ్యాయామం చేయాలని యువతకు సూచించారు.

గుండెపోటు బారిన యువత

ఆరిలోవ: యువత అధికంగా గుండెపోటు బారిన పడుతోందని అపోలో కార్డియాలజీ నిపుణుడు డాక్టర్ ఎస్.కె.పాణిగ్రాహి తెలిపారు. ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా శనివారం అపోలో ఆస్పత్రితో విలేకరులతో ఆయన మాట్లాడారు. యువత గుండెపోటుకు గురికావడానికి అనారోగ్యకరమైన జీవనశైలే కారణమన్నారు. దేశంలో యువజనాభా ఎక్కువగా ఉందని, 45 ఏళ్ల లోపు వారు 65 శాతం మంది ఉన్నట్లు చెప్పారు. 18 ఏళ్ల నుంచి 44 ఏళ్ల మధ్య వయసున్న యువకుల్లో 19.2 శాతం మంది తీవ్ర గుండెపోటుకు గురవుతున్నట్లు ఓ అధ్యయనంలో వెల్లడైందన్నారు. ఈ పరిస్థితి కోవిడ్ తర్వాత మరింత పెరిగిందన్నారు. యువత ప్రతి రోజూ 45 నిమిషాల పాటు వాకింగ్ చేయాలని, స్మార్ట్‌ఫోన్‌లు చూడటం, కంప్యూటర్లు గంటలు తరబడి వాడకం తగ్గించాలని సూచించారు. ఎర్ర మాంసం, ప్రోసెస్ చేసిన మాంసం తినడం మంచిది కాదన్నారు. యోగా, ధ్యానం చేయాలని సూచించారు. విద్యార్థులకు కూడా పాఠశాలల్లో యోగా, ధ్యానం ప్రత్యేకంగా నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు.

ఉక్కు పిడికిలి బిగిద్దాం

సీతంపేట: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అక్టోబరు 2న జరిగే భారీ ర్యాలీని విజయవంతం చెయ్యాలని ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ కన్వీనర్ వి.వి.రమణమూర్తి పిలుపునిచ్చారు. ఉత్తరాంధ్ర ప్రజా సంఘాల నాయకులతో కలిసి ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చెయ్యడానికి దూకుడు పెంచుతున్న సమయంలో ఉత్తరాంధ్ర ప్రజా సంఘాలు ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. విజయనగరం, శ్రీకాకుళం, విశాఖ జిల్లాల ప్రజా సంఘాలన్నీ కలిసి మహా ఉద్యమంలా డాబాగార్డెన్స్‌లోని అంబేడ్కర్ విగ్రహం నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు పెద్ద ఎత్తున ర్యాలీ ప్రారంభం అవుతుందన్నారు. అనంతరం గాంధీ విగ్రహం వద్ద తదుపరి



ప్రజా సంఘాల నాయకులతో కలిసి పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వి.వి.రమణమూర్తి

కార్యక్రమం కోసం తీర్మానం చేసి లక్ష మందితో ర్యాలీ చెయ్యడానికి నిర్ణయం తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఇఫ్టు నాయకుడు ఎం.వెంకటేశ్వర్లు, ప్రజా సంఘాల నాయకులు ఎం.లక్ష్మి, వై.నూకరాజు, జె.రవి, కె.ఎస్.చలం, కె.పద్మ, సూర్యప్రకాష్, రవి, ఉప్పల లక్ష్మణరావు, పి.ఎస్.తిలక్, ఎస్ఎస్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.